అభాగ్యులను ఆదుకునేదెవరు..?



చిన్నపాటి మంట వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్న అభాగ్యుడు

- పట్టెడన్నం కోసం ఎదురుచూపులు
- చలిగాలులకు గజగజా వణుకుతున్న నిరాశ్రయులు
- రోడ్ల పక్కన, చెట్ల కింద బిక్కు బిక్కుమంటూ జీవనం



చలికి అల్లాడుతున్న దివ్యాంగుడు



స్టేషన్ రోడ్డు ఫ్లై ఓవర్ కింద ఎండలో వృద్ధుడు

దాబాగార్డెన్స్: రోడ్డు పక్కన.. చెట్టు కింద.. ఫ్లై ఓవర్ దిగువన.. ఇలా ఎక్కడ పడితే అక్కడ.. కూటికి నోచుకోకుండా.. గుక్కెడు నీటికి దిక్కులేకుండా కాలం గడిపే అభాగ్యులు వారు. అయిన వారెవరో తెలియక.. ఏదారీ కానరాక.. పట్టెడన్నం పెట్టేవారే పరమాత్ములని భావించే నిర్భాగ్యులు వారు. ఎంత మండినా.. వాన విరుచుకుపడినా, చలి చెలరేగినా ఆపాటి భాగ్యానికి నోచుకోకుండా కడుపులో కాళ్లు ముడుచుకుని మగత నిద్ర పోయే దీనులు వారు. చలి విరుచుకుపడేసరికి వీరు పిడికెడు కూటికి నోచుకోకుండా పోయారు. మళ్లీ ఆ అదృష్టం ఎప్పుడు దొరుకుతుందోనని ఎదురుచూస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. నగర ప్రజలను వణికిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. మధ్యాహ్నం వరకు గజగజా వణికించిన చలిగాలులు పొద్దుపోయేసరికి మరింత ఉధృతమయ్యాయి. దీనికి వర్షం తోడైంది. అర్ధరాత్రి దాటిన తర్వాత చలి తీవ్రత మరింత ఎక్కువైంది. చలికాలంలో సతమతమవుతున్న నగర ప్రజలు వాయుగుండం తోడవ్వడంతో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు చలి గాలుల ధాటికి గజగజలాడారు. అభాగ్యుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వీరిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

చలికి అల్లాడుతూ.. దాతల కోసం ఎదురుచూస్తూ

విశాఖ రైల్వేస్టేషన్, ద్వారకా బస్టేషన్, ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద, రామ్మూర్తిపంతులు పేట బ్రిడ్జి కిందన, జగదాంబ జంక్షన్, కాన్వెంట్ జంక్షన్, రామకృష్ణా జంక్షన్, పూర్ణా మార్కెట్, దాబా గార్డెన్స్, కేజీహెచ్ పరిసర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్న అభాగ్యులు చలికి తట్టుకోలేక అల్లాడుతున్నారు. కప్పుకునేందుకు దుప్పట్లు లేక గోనె సంచులతో చలి బారి నుంచి తప్పించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ తమకెప్పుడు పట్టెడన్నం దొరుకుతుందా? అని నిరీక్షిస్తున్నారు.



ఎవరైనా దాతలు వచ్చి భోజనం ఇస్తారేమోనని ఎదురు చూస్తున్న అభాగ్యులు

అధిక వడ్డీ పేరుతో మోసం

- మరో వ్యక్తితో కలిసి పరారైన మహిళ
- టూటౌన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- సీపీని కలిసి ఫిర్యాదు చేసిన బాధితులు

అల్లిపురం: అధిక వడ్డీలు ఆశ చూపి రూ.4 కోట్లుతో వివాహిత పరారైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్మవారి వీధికి చెందిన మజ్జి ముత్యాలు భర్త, పిల్లలతో కలిసి సొంత ఇంట్లో నివసిస్తుంది. ఆమె గత రెండు సంవత్సరాలుగా స్థానిక మహిళలు, చిన్న చిన్న పనులు చేసుకునే వారి నుంచి అధిక వడ్డీల పేరుతో సుమారు రూ.4 కోట్లు వసూలు చేసింది. ఇటీవల ఆమె భర్త, పిల్లలను వదిలిపెట్టి స్థానికంగా గల సేనాపతి అప్పారావుతో కలిసి పరారైంది. దీంతో బాధితులు జి.వరలక్ష్మి, బి.జయలక్ష్మితో కలిసి వారం రోజుల క్రితం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొదుపు సంఘానికి కూడా ఆమె కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల పొదుపు సంఘానికి చెందిన పది మంది మహిళలు కట్టే డబ్బులు కూడా ఆమె బ్యాంకులో జమ చేయలేదని తేలింది. గత ఏడాది కాలంగా పొదుపు డబ్బులు కట్టకున్నా యుసీడీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముత్యాలుపై టూటౌన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కనీసం చర్యలు తీసుకోనందున పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

మహారాణిపేట: రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథ్‌రావు, కార్యదర్శి సిహెచ్.వి.రమేష్ కోరారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ జిల్లా రెవెన్యూ శాఖ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు యోగి, రవిశంకర్, విశాఖ రెవెన్యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జిలాని, చైతన్య, ఇతర నాయకులు రామకృష్ణ, వరుణ్, సిద్ధార్థ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కనక మహాలక్ష్మిని దర్శించుకున్న హోం మంత్రి



అమ్మవారికి పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

దాబాగార్డెన్స్: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం సిరుతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆమె సిరులతల్లికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు, వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మతోట ఎండోమెంట్ సమస్య పరిష్కరించండి



లక్ష్మీ ప్రసన్నతో మాట్లాడుతున్న ఎల్లమ్మతోట వాసులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు పరిధి ఎల్లమ్మతోట ఎండోమెంట్ సమస్య పరిష్కరించాలని దేవదాయ శాఖ ప్రతినిధి లక్ష్మీ ప్రసన్నకు ఎల్లమ్మతోట ఎల్‌పీ నెంబరు 13/49 లే అవుట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధి డ్వాక్రా బజార్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమెను కలిసి వినతిపత్రం అందజేసి, సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. దేవకీనంద ట్రస్ట్ చైర్మన్ దొడ్డి బాపూ ఆనంద్, ఎల్లమ్మతోట వాసులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరం

అల్లిపురం: అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై నిండుసభలో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అమిత్ షా చేసిన వాఖ్యలు ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. తక్షణమే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభిమానులందరికీ మంత్రి క్షమాపణ చెప్పాలని, రాజ్యాంగానికి లోబడి అతడిని ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ చేసుకుని అధికారంలోకి వచ్చిన బీజేపీకి దేశ ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

28, 29 తేదీల్లో సీపీఎం విశాఖ జిల్లా మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: సీపీఎం విశాఖ జిల్లా మహాసభలు ఈ నెల 28, 29 తేదీల్లో సుజాతనగర్‌లో నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, సీనియర్ నాయకుడు ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు వి.కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం జగదాంబ జంక్షన్ సమీపంలో గల సీపీఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. గత మూడేళ్లలో నిర్వహించిన కార్మిక, ప్రజా పోరాటాలు ఈ మహాసభల్లో సమీక్షించుకొని వచ్చే మూడేళ్ల కాలంలో చేపట్టబోయే ఉద్యమ ప్రణాళిక విడుదల చేయనున్నట్టు చెప్పారు. 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కళాశాల నుంచి సుజాతనగర్ వరకు భారీ ప్రదర్శన, ప్రదర్శన అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు

అల్లిపురం: ఎన్‌సీడీ 3.0 సర్వే, ఆర్‌బీఎస్‌కే స్కూల్ విజిట్స్, ఏడబ్ల్యూసీ స్క్రీనింగ్ తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కొబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో సమీక్షించారు. ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ 3.0 సర్వేపై సమీక్షిస్తూ వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలితే తక్షణమే సంబంధిత వైద్యాధికారికి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి తెలియజేయాలని కోరారు. అలా చేస్తే తగిన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ముఖ్యంగా అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీపీవో శశిభూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వింగ్ పనితీరుపై ఆరా



కల్నల్ గోపేంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంజుల, గీతాంజలి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని 2(ఆర్టిలరీ) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ వింగ్ పనితీరును కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర బుధవారం పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.గీతాంజలి ఆయనను ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కల్నల్ గోపేంద్ర కేడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ డిఫెన్స్ సర్వీస్‌లోకి ప్రవేశించడానికి గల మార్గాలు వివరించారు. కళాశాలలో ఎన్‌సీసీ వింగ్ చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని అభినందించారు.

ఏవీఎన్ కళాశాలలో ప్రీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ సందేశమిస్తున్న పాస్టర్ డేవిడ్‌రాజు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో బుధవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధన ప్రార్థనలు, క్రీస్తు ఆధ్యాత్మిక గీతాలపనలు చేశారు. విద్యార్థులు శాంటాక్లాజ్ వేషధారణలో అలరించారు. కేక కట్‌చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. పాస్టర్ డేవిడ్‌రాజు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ కుల, మత, జాతి బేధాలు లేకుండా అన్ని పండగలు ఏవీఎన్ కళాశాలలో జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ శంకరనారాయణరావు, పైడి రజని, జి.యేసయ్య, సురేష్‌బాబు, జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గారావు కృషి నిరుపమానం

విద్యా రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఏవీఎన్ జగ్గారావు 98వ జయంతి బుధవారం కళాశాలలో నిర్వహించారు. విద్యా రంగంతో పాటు సామాజిక వికాసానికి జగ్గారావు చేసిన కృషిని కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు కొనియాడారు. ముందుగా జగ్గారావు చిత్రపటానికి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు.

క్రిస్మస్ పోటీల్లో ఉషారాణి ప్రతిభ

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో నిర్వహిస్తున్న ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా బుధవారం జరిగిన సింగింగ్ పోటీల్లో హెడ్ నర్స్ ఉషారాణి మొదటి బహుమతి గెలుచుకున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చేతుల మీదుగా ఆమె బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, ఏఆర్ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్.అప్పారావు, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, పలువురు హెడ్ నర్సులు, నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు కోలుకున్న మానసిక రోగులు



కోలుకున్న మానసిక రోగులతో శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార: దయనీయ స్థితిలో ఉంటూ విశాఖ రైల్వే స్టేషన్‌లో మగ్గిపోతున్న 8 మంది మానసిక రోగులను రెస్క్యూ చేసిన ఏయూటీడీ సంస్థ వారికి ద్వారకానగర్‌లోని జీవీఎంసీ టీఎస్సాఆర్ కాంప్లెక్స్ పురుషుల, మహిళల షెల్టర్ హోమ్స్‌లో ఆశ్రయం కల్పించారు. ముంబై నుంచి వచ్చి ఇక్కడ ఉండి పనిచేస్తున్న శ్రద్ధా బృందం ద్వారా చికిత్స చేయిస్తుండటంతో త్వరగా కోలుకుంటున్నారు. బిహార్ రాష్ట్రం రహతాస్‌కు చెందిన విజయ్, గయా నుంచి సుందర్, పాట్నాకు చెందిన మహిళ అత్తరి, అస్సాం డిబ్రుఘర్ చెందిన మిదుల్, త్రిపురా ఉనకోటి నుంచి అరుణబదేవ్, బ్రిజేష్‌కుమార్, బులంద్సర్ యూపీ పార్వతి, ఇండోర్ ఎంపీ నుంచి రాణి, గస్ శంకర్, పంజాబ్‌లను శ్రద్ధా ఫౌండేషన్ సభ్యుల ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించడానికి పంపించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

సిరులతల్లి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేక పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: మార్గశిర మాస మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టౌన్ కొత్త రోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతోపాటు రూ.100 శీఘ్ర దర్శనం, రూ.200 ప్రత్యేక దర్శనంతో పాటు రూ.500 ఉత్సవ ప్రత్యేక దర్శనం ప్రవేశ క్యూలైన్ల టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతోపాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుక భాగం, ఆలయ ప్రధాన ద్వారం (వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్ పోస్ట్ తోపాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాస్పత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసుల బందోబస్త్ ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. బుధవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రీడింగ్ రూమ్ ఎదురు రోడ్డులో తాత్కాలిక టాయ్‌లెట్లు ఏర్పాటు చేశామన్నారు. పలు దేవాలయాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చామని, ఆలయ పరిసర ప్రాంతమంతా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా జీవీఎంసీ సహకారం తీసుకున్నామని తెలిపారు.

సిరులతల్లికి ప్రత్యేక పూజలు

మార్గశిర మాసోత్సవాల 17వ రోజు బుధవారం అధిక సంఖ్యలో భక్తులు సిరులతల్లి శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ టెస్టులో నిఖిలేష్ ప్రతిభ



నిఖిలేష్‌ను అభినందిస్తున్న జయప్రకాష్, తదితరులు

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన వేదాంతు – విజ్ఞాన్ సంస్థ నిర్వహించిన మెగా స్కాలర్‌షిప్ అడ్మిషన్ టెస్టులో సెయింట్ అలోసియస్ ఆంగ్లో ఇండియన్ విద్యార్థి వీఎస్ నిఖిలేష్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. స్కాలర్‌షిప్ టెస్టుకు సంబంధించి పదో తరగతి చదువుతున్న నిఖిలేష్ విశాఖ పరిధిలో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఆలిండియా స్థాయిలో 9వ స్థానంలో నిలిచాడు. వేదాంతు సంస్థ నిఖిలేష్‌కు స్మార్ట్‌ఫోన్ బహూకరించడంతోపాటు రెండేళ్ల ఫీజు రూ.4 లక్షల్లో కేవలం రూ.60 వేలు చెల్లిస్తే చాలని హామీనిచ్చింది. ఈ మేరకు సెయింట్ అలోసియస్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్, కరస్పాండెంట్ థామస్ పెరుమాలిల్, తదితరులు విద్యార్థి నిఖిలేష్‌ను అభినందిస్తూ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

హార్బర్‌లో జనవరి నుంచి ప్లాస్టిక్ వినియోగించొద్దు



హార్బర్‌లో డోంట్ యూజ్ ప్లాస్టిక్ లెటర్లను ప్రదర్శిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మహారాణిపేట: జనవరి 1 నుంచి ఫిషింగ్ హార్బర్, ఫిషింగ్ బోట్లలో ప్లాస్టిక్ వినియోగించరాదని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. హార్బర్‌లో బుధవారం బోటు యజమానులు, చేపల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం అమలులోకి వస్తుందని చెప్పారు. అందువల్ల హార్బర్ ఏరియాలు, మత్స్యకారులు నివసించే కాలనీలు, ఫిష్ మార్కెట్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపివేసి వాతావరణాన్ని కాపాడటంలో సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వాడక నిషేధం కోసం ఒక బృందాన్ని నియమిస్తున్నామని, ముందుగా మత్స్యకారులకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డి.మురళీ, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు రత్నం, బోసు, వీర్రాజు, నాగరాజు, బాలాజీ, హనీ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు వైభవంగా జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ పూజలు చేశారు. అమ్మవారికి భక్తుల స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దొండపర్తి అక్కయ్యపాలెం, రైల్వే న్యూ కాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలిత నగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ స్వహస్తాలతో పసుపు నీళ్ల అమ్మవారిపై పోశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వినతుల స్వీకరణ



మాట్లాడుతున్న భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్



మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు



కలెక్టరేట్ వద్ద విదసం కన్వీనర్ బూసి వెంకటరావు, సామాజిక కార్యకర్త సుధాకర్ తదితరులు

మహారాణిపేట: షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ బుధవారం విశాఖలో పర్యటించింది. కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా కులాల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకుల నుంచి మొత్తం 194 వినతులు స్వీకరించారు.

'సుప్రీం' తీర్పు రాజ్యాంగ విరుద్ధం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో కమిషన్‌కు వినతిపత్రం సమర్పించి, మీడియాతో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ నియామకంలో ఆర్టికల్ 338 క్లోజ్9 ప్రకారం ఎస్సీ కమిషన్ అనుమతి తీసుకోవాలన్నారు. ఆ ప్రక్రియ లేకపోవడం వల్ల ఈ కమిషన్ సిఫార్సులు చెల్లుబాటు ప్రశ్నార్థకంగా ఉందన్నారు. భీమ్ సేన వార్ కోశాధికారి బల్లంకి కనకరాజు, సహాయ కార్యదర్శి నామాల రేణుకుమార్, కార్యవర్గ సభ్యుడు ఎద్దు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రెల్లి'లకు 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

అన్ని రంగాల్లో వెనుకబడ్డ రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని జాతీయ రెల్లి గ్రూప్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు కోరారు. కమిషన్‌ను వినతిపత్రం సమర్పించి, కలెక్టరేట్ వెలుపల మీడియాతో ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన వర్గీకరణ వల్ల రెల్లి కులానికి ఒక శాతం రిజర్వేషన్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రెల్లి కులస్తులు వెనుకబడి ఉన్నారని, వీరికి న్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. రెల్లి కుల సంఘం నాయకులు ఇంటి గురుమూర్తి, కల్యాణ్ ముని, అనురాధ, కస్తూరి వెంకటరావు, బంగారు ఈశ్వరరావు, చెన్న పాల్, వద్దాది ప్రకాష్, చెన్న ఉమామహేష్, రాజన రామారావు, చొక్కాకుల రాంబాబు. దశమంతుల చిన్ని, చిన్న వెంకటరావు, వద్దాది గోవిందరాజులు, మాడుగుల భాస్కరరావు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు అమలు చేయవద్దు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆమోదయోగ్యం కాదని, దీనిని అమలు చేయవద్దని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, సామాజిక కార్యకర్త సోడదాసు సుధాకర్ కోరుతూ ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మీడియాతో బూసి వెంకటరావు మాట్లాడుతూ ఈ తీర్పు వల్ల ఎస్సీల్లో ఎంతో మందికి అన్యాయం జరుగుతుందన్నారు. కొందరి స్వలాభం కోసం సామాజిక కోణంలో ఉన్న రిజర్వేషన్లను వర్గీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సక్రమించిన రిజర్వేషన్లపై తీర్పు అర్థరహితమని, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలని బీమ్ సేన చిన్నారావు అన్నారు. ఎస్సీ కమిషన్ అనుమతి లేకుండా చేసిన వర్గీకరణ చెల్లుబాటు కాదని దళితసేన నేత గొలమాల అప్పారావు, ఏపీ రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు దశమంతుల చిన్ని, సిహెచ్.వెంకటరావు, వద్దాది గోవిందరాజులు, మాడుగుల భాస్కరరావు తదితరులు అన్నారు. అనేక దళిత సంఘాల నాయకులు పతివాడ రాంబాబు, ఎస్సీ, ఎస్టీ అంబేడ్కర్ నేషనల్ ఫెడరేషన్ ఏపీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు వినతిపత్రం సమర్పించారు.